క్లుప్తంగా

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ..


నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన ఓబీసీ జిల్లా అధ్యక్షుడు, కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం తల్లి అచ్చమ్మ ఇటీవల మృతి చెందగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా అచ్చమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గింజల నరసింహారెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, బొర్రా రాజశేఖర్, నల మోతు లక్ష్మయ్య, ధనియాకుల హన్మంతరావు, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, మద్దిన్ని నరసింహారావు, మహేష్, శివయ్య పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేటకు చెందిన టీడీపీ రాష్ట్ర నాయకుడు సానబోయిన శ్రీనివాస్‌గౌడ్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు


రాంచందర్‌రావుతో నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఎన్.రాంచందర్‌రావును ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్నె ఉదయ్ ప్రతాప్ హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్ ప్రతాప్ మాట్లాడుతూ.. రాంచందర్‌రావు నాయకత్వంలో తెలంగాణలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్‌గౌడ్, అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ గ్రామ పంచాయతీలో ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాల వారికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందించిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని స్థానిక నాయకులు అందించారు. ఈమేరకు ఆదివారం కురియాల నారాయణ, బాల నాగన్న, ఆకుల రవి, జంగాల లావణ్య కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు తమ్మినేని నవీన్ వెంకటరెడ్డి, మద్ది ఎల్లారెడ్డి, బండి జగదీష్, ప్రతాపనేని రఘు, వీరెల్లి అప్పారావు, యాదాల లింగయ్య, గాంధీ మల్లయ్య, రామారావు, లక్ష్మయ్య, ఉపేందర్‌రావు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	తమ్ముడు
వినోద	జురాసిక్ వరల్డ్, ఎఫ్1
సాయిరాం	3 బీహెచ్‌కే, మార్గన్
ఆదిత్య	కన్నప్ప
శ్రీనివాస	కుబేర

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	38	బచ్చలికూర	4
వంకాయ	40		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	96		20
కాకర	56	చుక్కకూర	3
బీర	40		20
దొండ	40	తోటకూర	4
పొట్లకాయ	50		20
చిక్కుడు	56	గోంగూర	4
గోరుచిక్కుడు	46		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	45		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	28		30
క్యారెట్	48	పుదీన	1
బీట్‌రూట్	40		20
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

ఓ వైపు అభివృద్ధి.. మరోవైపు ఇబ్బంది..

డ్రెయినేజీ పనులతో రాకపోకలకు అవస్థలు

- రోడ్డంతా తవ్వకాలు, గుంతలు, మెటీరియల్ మయం..
- వాహనదారులపై చిందిపడుతున్న మురుగునీరు


మరమ్మతు పనులతో అస్తవ్యస్తంగా ట్రాఫిక్



మురుగు నీటితో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ఖమ్మం అర్బన్: నగరంలోని పదో డివిజన్ పరిధిలో అభివృద్ధి పనుల పేరుతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. వైరా రోడ్డులోని ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి ఇందిరానగర్ వరకు డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో రహదారి మొత్తం తవ్వకాలు, మట్టి గుంతలతో, నిర్మాణ సామగ్రి, ఇతర మెటీరియల్‌తో దారుణంగా మారింది. ఒక వైపు వర్షాలు కురుస్తున్న వేళ తవ్వకాల మధ్య వాహనదారులు రాకపోకలతో రోడ్డుపై తడబడుతున్నారు. ప్రధానంగా కోర్టు, ఐటీ హబ్ సహా పలు గ్రామాలకు వెళ్లే మార్గం ఇదే కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటోంది. అయితే మురికినీటి కాల్వ నిర్మాణానికి అడ్డంగా ఉన్న నీటిని మోటర్ల సాయంతో రోడ్డు వైపు వదలడంతో పూర్తిగా రహదారిపైకి మురికి నీరు చిందిపడుతోంది. దీంతో వాహనదారులు ఆ నీటిలో ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముద్దగా మారిన రహదారి, మురికి దుర్వాసన వల్ల స్థానికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే డివిజన్ పరిధిలో మరోవైపు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో అంతర్గత రోడ్లు తవ్వకాలతో ఈ రోడ్లు అధ్వానంగా మారాయి. మట్టికుప్పలు రోడ్డుపై ఉండటంతో వానాకాలం కావడంతో రోడ్డంతా రొచ్చుతో ఇబ్బందిగా మారింది. పాఠశాలలు ఉన్న ప్రాంతమైన పదో డివిజన్‌లో పిల్లలను తీసుకెళ్లే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రవాణా పరంగా మార్గాలను ఉంచి ఒకే సారి అన్ని ప్రాంతాల్లో ప్రారంభించకుండా, ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసి వేగంగా పూర్తిచేస్తే ఇలాంటి ఇబ్బందులు తలెత్తేవికావని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేసి, మురికినీరు ప్రధాన రహదారులపైకి పోకుండా, వచ్చిన మురుగు నీరు రోడ్డుపైనే నిలిచి ఉండి వాహనాల రాకపోకలకు చిందులు పడేలాకాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉదారవాద రాజకీయాలతో పెనుప్రమాదం



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

కూసుమంచి: ఉదారవార రాజకీయాలతో పెను ప్రమాదం పొంచి ఉందని, ఈ రాజకీయాలు శాస్త్రీయతను, లౌకిక తత్వాన్ని, సోషలిస్ట్ భావాలను దెబ్బతీస్తాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కూసుమంచిలోని పార్టీ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పార్టీ రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామ స్థాయి నుండి పార్టీకి బలమైన పునాదులు వేయాలని, అప్పుడే అది రాజకీయ శక్తిగా ఎదుగుతుందన్నారు. శీలం గురుమూర్తి పార్టీ పతాకాన్ని ఎగరవేయగా నాయకులు మల్లెల సన్మంతరావు, పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, రమాణారెడ్డి, గన్యానాయక్, వెంకటేశ్వరరావు, కర్ణబాబు, గంగాధర్, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, ఉపేందర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

నేలకొండపల్లి: దేశంలో చరిత్రకు వక్రీకరిస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని రావెళ్ల భవన్ లో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, రచ్చా నరసింహారావు, సిరికొండ ఉమామహేశ్వరీ, దండా సూర్యనారాయణ, బెల్లం లక్ష్మి, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టికోల వెంకన్న, చింతలపాటి భాస్కర్, దుగ్గి నరసింహారావు, బొడ్డు మధు, బలుసు ప్రమీలా, భూక్యా కృష్ణ, కె.వీ.చారీ, లింగరాజు, మల్లేశ్వరరావు, సామాల మల్లిఖార్జున్‌రావు, బొడ్డు బాబు, బీ.కోటేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడికి మెడికల్ ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ రుద్ర గౌతమ్ నరేష్

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాకు చెందిన సురక్ష సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ ప్రముఖ ఎండి.జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రుద్రగౌతమ నరేష్‌కు మెడికల్ ఎక్సలెన్స్ 2025 అవార్డు లభించింది. ఈ మేరకు శనివారం హైదరాబాదులో గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్‌వర్మ, కలెక్టర్ హరి చందనల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా హాస్పిటల్ ఆధ్వర్యంలో పేదలకు వైద్యపరీక్షలు నిర్వహించి అనారోగ్యాలకు మందులు ఉచితంగా అందజేశారు. సుమారు 30,000 మందికి వివిధ రకాల వైద్యసేవలను సురక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య సదుపాయాన్ని అందించారు. ఈ సందర్భంగా గౌతమ్ నరేష్‌ను పలువురు అభినందించారు.

ఆనందాలు పంచిన తొలి ఏకాదశి


ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో హోమం చేస్తున్న భక్తులు


ఖమ్మం అర్బన్ బోనాలతో మహిళలు..


కాల్వొడ్డు ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: మొదటి పండుగ తొలి ఏకాదశి ఆనందాలను పంచింది. ఈ సందర్భంగా తెల్లవారుజామున నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నగరంలోని స్తంభాద్రి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. కమాన్ బజార్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, కాల్వొడ్డులోని శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవాలయం, రంగనాయకుల గుట్టపై ఉన శ్రీ రంగనాథ స్వామి దేవస్థానం, ట్రంక్ రోడ్‌లోని శ్రీ గుంటుమల్లేశ్వర స్వామి దేవస్థానం, గుట్టల బజార్‌లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం, శ్రీ సీతారామ చంద్రస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పండుగ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పండుగ సందర్భంగా మొక్కజొన్న పేలాలతో పిండిని తయారు చేసుకొని ప్రసాదంగా స్వీకరించారు.

కామేపల్లి: మండలంలోని దేవాలయాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయంలో ఆలయ పూజారి పుల్లయ్యశర్మ ఆధ్వర్యాన అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించగా భక్తులు పాల్గొన్ని పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు.

పర్ణశాలలో..

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా విశేష అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ ఈఓ వీవీ నరసింహారావు, అర్చకులు ఎస్. కృష్ణ కిషోర్, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయ ప్రసాద్, ఇతర సిబ్బంది, భక్తులు ఉన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకుని, సమీపంలోని మైసమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు చేశారు.

అమ్మవారికి మొక్కులు...

తొలి ఏకాదశి సందర్భంగా ఖమ్మం నగరానికి విలీనమైన పలు గ్రామాలు, రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మండలంలోని బూడిదంపాడు గ్రామంలో సామూహికంగా బోనాలు సమర్పించడం విశేషంగా నిలిచింది. మహిళలు బోనాలు మోసుకుంటూ ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మీనాకు 'నాట్య కళామంజరి'..


మీనాకు అవార్డును అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంకు చెందిన నాట్యగురువు ఏలూరి మీనా ప్రతిభకు గుర్తింపుగా నాట్య కళామంజరి అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమిలు నిర్వహించిన తెలంగాణ బోనాల సంబురాలు-2025 కార్యక్రమంలో మీనా కళాబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు సభికులను అలరించాయి. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా అవార్డును అందించి మీనాను ఘనంగా సత్కరించారు. మీనా కళాబృందానికి కూడా నిర్వాహకులు ప్రగతి పత్రాలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మీరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాను పలువురు అభినందిస్తున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో సీటు


కందుల చరణ్

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి కందుల చరణ్ బాసర ట్రిపుల్ ఐటిలో సీటు సాధించాడు. పది ఫలితాలలో 555 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా చరన్‌ను ఎంఈఓ శ్రీనివాస్, గ్రామస్తులు అభినందించారు.

మర్చంట్స్ అసోసియేషన్ చాంబర్‌లో విలీనం



మాట్లాడుతున్న కృష్ణారావు, పక్కన ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ది ఖమ్మం మర్చంట్స్ అసోసియేషన్‌ను ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్‌లో విలీనం చేయడానికి ఏకగ్రీవంగా అంగీకరించినట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు తెలిపారు. ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ సర్వసభ్య సమావేశం స్థానిక వర్తక సంఘం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్చంట్స్ అసోసియేషన్ వారి ఆశయం మేరకు సంస్థను విలీనం చేస్తున్నామని, భవిష్యత్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ నామకరణతోనే సంస్థ చట్టబద్ధంగా కొనసాగుతుందన్నారు. సంఘం భవనం పూర్తి స్థాయిలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధీనంలోనే ఉంటుందన్నారు. 1,200 మంది సభ్యులు, 19 శాఖలతో విరాజిల్లుతున్న చాంబర్ ఆఫ్ కామర్స్‌ను చట్టబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొందరు సభ్యులు నిబంధనలు అతిక్రమించి మరో అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకుని వాణిజ్య సంఘాల ఐక్యతకు భంగం కలిగిస్తున్నారన్నారు. వర్తకుల ఐక్యతకు భంగం చేసే వారిపై చట్టపరంగా ఎదుర్కొంటామన్నారు. బ్యాంకు ఖాతాల నిర్వహణ, పాన్‌కార్డ్ అనుసంధానం వంటి అంశాలపై సమావేశం చర్చించి ఏకగ్రీవ తీర్మానాలు చేసింది. ఈ సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, పూర్వపు కార్యదర్శి గొడవర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సోమా నరేష్,(జీవై నరేష్), సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

నేలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజెవైయం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో డాక్టర్.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆదివారం మొక్కలు నాటారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అన్ని సామాజిక వర్గాల వారికి న్యాయం చేసేలా పథకాలు ప్రారంభిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. కాంగ్రెస్ కు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, నాయకులు మన్నె కృష్ణారావు, షేక్ షర్ఫుద్దీన్, బాజా రామకృష్ణ, కొండా హర్ష, కందరబోయిన వెంకటరమణ, కల్యాణం నాగేశ్వరరావు, ఎలిగేటి నరసింహారావు, పిట్టల సూరిబాబు, కందరబోయిన గోపి, జీ.క్రాంతి, గెల్లా నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం..


అభివాదం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 9న నిర్వహించే జాతీయ సమ్మెను జయప్రదం చేద్దామని ఆర్టీసీ ఖమ్మం రీజియన్ జేఏసీ నాయకులు బత్తినేని హనుమంతరావు, పిల్లి రమేష్, పిట్టల సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని సిహెచ్.వి.రామయ్య స్మారక భవనంలో గుండు మాధవరావు, బూదాటి శ్రీనివాసరెడ్డిల అధ్యక్షతన ఏర్పాటైన ఆర్టీసీ ఖమ్మం జేఏసీ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం చట్టాల మార్పు పేరుతో నాలుగు లేబర్‌కోడ్‌లుగా రూపొందిస్తోందన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎంప్లాయిస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌ల నాయకులు పగిళ్లపల్లి నరసింహారావు, బేతంపూడి బుచ్చిబాబు, దేశబోయిన జగన్నాథం, గుగ్గిళ్ల రోశయ్య, బుగ్గవీటి లింగమూర్తి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఈనెల 9న నిర్వహించనున్న సమ్మెకు సంబంధించిన ఆటోడ్రైవర్ల బంద్ కరపత్రాలను ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు ఎండి వై.పాషా అధ్యక్షతన యూనియన్ జేఏసీ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మైస ఆంజనేయులు, మేకల వినోద్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జిల్లా ఉపేందర్, రాందాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ బాయ్, పేరబోయిన మోహన్‌రావు, ఎస్‌కే.సత్తార్, వేణు, టీయూసీఐ జిల్లా అధ్యక్షులు శ్రీను, నాయకులు లక్ష్మీనారాయణ, మీగడ రామారావు పాల్గొన్నారు.

'వైద్యపండిత' బిరుదు ప్రదానం


బిరుదు ప్రదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంకు చెందిన ప్రముఖ ఆయుర్వేద పారంపర్య వైద్యులు రామడుగు వీరభద్రాచారికి 'వైద్యపండిత' బిరుదు లభించింది. ఈ మేరకు రాష్ట్ర పారంపర్య వైద్య మహాసంఘం ప్రథమ వార్షికోత్సవం, నిరంతర పారంపర్య ఆయుర్వేద వైద్యవిజ్ఞాన సదస్సు ఈనెల 4, 5, 6 తేదీల్లో యాదగిరి గుట్టలోని అఖిల భారత పద్మశాలి అన్నసత్రంలో సంఘం అధ్యక్షుడు దొంతయాత్రి మహర్షి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో గత 45 సంవత్సరాలనుండి పారంపర్య ఆయుర్వేద వైద్యునిగా అనుభవం సంపాదించుకుని వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న రోగులకు వైద్య సేవలందిస్తున్నందుకు గాను ఈబిరుదు లభించింది. సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షులు దొంత యాత్రి మహారుషి, చంద్రశేఖరరాజు, జాతీయ ఉపాధ్యక్షుడు ఎండి.జమాల్ ఖాన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పంతులు రఘుపతి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఉన్నారు.

దుమ్ముతో సతమతమవుతూ..


డివైడర్ల మధ్యలో ఇంకా రోడ్డు వేయని దృశ్యం

- డివైడర్లు తొలగించినా రోడ్డు వేయని వైనం

ఖమ్మం రాపర్తినగర్: ఇటీవల రాపర్తినగర్ నుంచి మయూరిసెంటర్ వరకు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లను తొలగించిన దుమ్ము లేవడంతో ఆ ప్రాంత ప్రజలు సతమతమవుతున్నారు. ఈ రోడ్డులో రోజుకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అప్పట్లో రోడ్డు ఇరుకుగా ఉండటంతో డివైడర్లను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే నెలల గడుస్తున్న డివైడర్ల మధ్యలో వాహనాలే వెళ్లే సమయంలో దుమ్ము లేవడంతో పక్కనే నడక కొనసాగిస్తున్న వారు, షాపుల వారు సతమతమవుతున్నారు. తొలగించిన డివైడర్ల మధ్యలో రోడ్డు వేయపోవడంతో దుమ్ములేవడమే కాక గోతులు పడుతున్నాయి. దీంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్లను తొలగించినా రోడ్డు వేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. నిత్యం ఈ రోడ్డులో బస్ డిపోకు సంబంధించిన బస్సులతో పాటు ఇతర వాహనాలు వెళ్తుంటాయి. ఖమ్మంకు ప్రధాన రోడ్డుగా ఈ రోడ్డు అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై అధికారులు నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపాల్ అధికారులు రోడ్డు వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మొహర్రం వేడుకలు

మొహర్రం వేడుకలను ఆదివారం కులమతాలకు అతీతంగా జరుపుకున్నారు. పీరలను ఊరేగించి నిమజ్జనం చేశారు. - సాక్షి నెట్‌వర్క్


తిరుమలాయపాలెంలో..


ఖమ్మం మామిళ్లగూడెం: పీరీల ఊరేగింపు..